# గతి తార్కికం : జరిగే వింతలు

* పంతుల విశ్వనాధరావు *

★

ఏప్రెల్ నేల తొలివారంలో పుకారు పుట్టింది.

రాజుగారి సోడాషాపు దగ్గర స్నేహితులందరికి 'లస్సీ' లిప్పిస్తు అన్నాడు లవంగరావు "మన శాస్త్రి కమ్యూనిస్టు లాగున్నాడే" అని. సగం తాగుతూన్న లస్సీగ్లాసు క్రిందికిదింపి "అవును సుమీ. వాడు కామ్రేడులతో తిరగడం నేనుచాలా సార్లుచూసేను" అన్నాడు ఏలకిరావు. తనొక్కడు వేరైపోవడం బాగుండదని "అసలతను పక్కా కమ్యూనిస్టుమెంబరుకూడానోయ్" అని తన కంఠాన్ని కూడా మేళవించేడు వక్కశర్మ. లవంగరావన్నాడు "అయితే వాడు పార్టీకి డబ్బుకూడా యిస్తున్నాడాన్నమాట". సమయం వచ్చిందికదా అని సర్దుకున్నాడు వక్క శర్మ "ఆఁ. ఒకసారి వేళకి వాడిదగ్గర డబ్బులేకపోతే నా దగ్గర పచ్చ నోటు బదులు తీసికొని మరీయిచ్చేడు".

"ఆఁహా" అన్నాడు లవంగరావదో రకం నిట్టూర్పుతో ;

రెండవ వారంలో : ఒకరోజు అయ్యరు కాఫీ హోటల్లో టిఫిన్‌చేస్తూ అన్నాడు లవంగరావు "మన కమ్యూనిస్టు కనపడలేదేమోనోయ్"అని. "బహుశః సమ్మె చేస్తున్నాడేమోనోయ్"అన్నాడు ఏలకరావు. అందరూనవ్వేరు. "పోనిస్తూ, ఆ కమ్యూనిస్టుగాడి గోల మనకెందుకు"అన్నాడు వక్కశర్మ అంతరాళంలోనున్న అసూయని అసహ్యంగా కప్పుకుంటూను. "ఎవరు బాబూ ఆ కమ్యూనిస్టు ?" ఎదురుగా కూర్చుని కాఫీ త్రాగుతున్న సెట్టిగారడిగేరు.

"మాతో చదువుకుంటున్నాడు లెండి 'శాస్త్రి' అని ఓ అబ్బాయి" అని సమాధానించేడు వక్కశర్మ. సెట్టిగారి పక్కనే కూర్చుని కాఫీ తాగుతున్న ఆచార్లు "మన పంతులుగా రబ్బాయేనా ఏమిటి బాబూ ? అబ్బా. అంత వాడయేడూ" అన్నాడు.

యింతలో మూలని కూర్చుని కాఫీత్రాగుతున్న మరో దేశభక్తుని కంఠస్వరంకూడా ఈ అనంత ప్రేమవాయువుతో లీనమైపోతుంది. "అలాటి వాళ్ళను సహించకూడదండి. ఒక్కడుంటే చాలు మన వూరంతటిని విషమయం చేసేస్తాడు. వెంటనే వాడిని దుంపనాశనం చేసెయ్యాల. లేదా. అధమం మన వూరినేనా తీసుకెళ్ళి ఏ నైజాంకో, ఏ రష్యాకో అప్పచెప్పేస్తాడు. రంగాగారు చెప్పినట్లు యీ కమ్యూనిస్టుదోమ నొక్కసారి వాలనిచ్చేమా అంటే మలేరియా పటుకుందన్నమాటే"నని.

మూడోవారం ; అంతా కలసి రైలుపట్టాల పక్క షికారు వెళ్లేరు. ఈ తూరి కామ్రేడు శాస్త్రికూడా వున్నాడా బృందంలో ; కాలేజీ అమ్మాయిల గురించి స్పెషల్‌కోడు (మారుపేర్లు) లో వుపన్యసిస్తున్నాడు లవంగరావు. లవంగరావన్నాడు "మన మైసూరెడ్లు మహాఖచ్చితమైన జంతువ షుమ్మీ"అని. ఏలకరావందుకున్నాడు "బుల్డాగంత కంటె బ్యూటిఫుల్‌గా వుంటుంది!" "....కాని, ఆ అమ్మాయికి గొప్ప తలతిరుగుడు సుమ్మీ "అన్నాడు వక్కశర్మ. ఏమంటే అతనోసారి ఆమెతో అల్లరిగా మాటాడ ప్రయత్ని సే

ఆమె 'తుః' అని ముఖంమీదే వుమ్మేసింది. సంభాషణ మార్చాలనే వుద్దేశంతో శాస్త్రి "ఆస్తిక నాస్తికవాద సమస్యని తెచ్చిపెట్టేడు. లవంగ రావు అతనితోపాటు ఏలకరావు, వక్కా శర్మ కూడా ఆస్తికవాదాన్నే సమర్థించేరు. చర్చపొడి గించాలనే వుద్దేశ్యంతో శాస్త్రి నాస్తికవాదాన్ని బలపర్చాలనుకున్నాడు. యింతలోకే ప్రత్యక్ష మయ్యేడు దూరాన్నుంచి యిదంతా వింటూన్న బోడిసెట్టి. బోడిసెట్టి మనస్తత్వం ఎలాటిదంటే అతనేదన్నా సహిస్తాడుకాని దేవుడి పేరెత్తితే వెర్రెత్తిపోతాడు. అతనన్నాడు. "ఇదిగో శాస్త్రీ! చెప్తున్నాను విను. కూసేగాడిదవచ్చి మేసేగాడి దని చెడిపిందన్నట్లు, నువ్వు చెడిపోవడమేకాక వీరందర్నీ చెడిపేస్తున్నావు. నీ రష్యా తత్వ మంతా యిక్కడ తెచ్చిపెట్టినట్టయితే మాత్రం వొప్పుకొనేది లేదు," అని నాలుగు చీవాట్లువేసి మరీ పోయేడు. నవ్వలేక సానుభూతి ప్రకటిం చేరు మిత్రులు.

నాలుగో వారం: "పంతులూ! మీ శాస్త్రి కమ్యూనిస్టయి వూరందరినీ పాడుచేస్తున్నాడు సుమా" అన్నాడు పలుకుబడిగల అడ్వకేటు రావుగారు,

"తనతోపాటు వూరందరినీ పాడుచేస్తున్న కొడుకుని చూనూ వూరుకుంటావేమయ్యా?" అని ప్రశ్నించేడు డాక్టరు చౌదరి.

"ఏమయ్యా, నీ కొడుక్కి బుద్ధి చెప్పుకొం టావా? మమ్మల్ని చెప్పమంటావా?" అని అడి గేడు అయ్యవారు హరిహరరావు.

ఎవ్వరికి ఇష్టంలేకుండా రాయవెల్లూరు పంపిం చేసి కధపూర్తి చేసేశాడు దేశభక్తుడు'

